క్లుప్తంగా

రుయా అభివృద్ధి కమిటీ సభ్యుడికి సత్కారం



లక్ష్మీపతిని సత్కరిస్తున్న బలిజసేన నేతలు

తిరుపతి కల్చరల్ : రుయా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బండ్ల లక్ష్మీపతిని గురువారం బలిజ సేన నేతలు ఘనంగా సత్కరించారు. లక్ష్మీపతి మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. బలిజసేన అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ లక్ష్మీపతి భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బలిజసేన నేతలు ప్రభాకర్, గురవయ్య, మధు, నరేంద్ర, ప్రేమ్‌కుమార్, శివచెంగయ్య పాల్గొన్నారు.

22 నుంచి వారాహి రథయాత్ర



విలేకర్లతో మాట్లాడుతున్న ట్రస్ట్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్ : సమాజ శ్రేయస్సు కోసం ఈ నెల 22వ తేదీ నుంచి శ్రీవారాహి మహారథయాత్ర నిర్వహించనున్నట్లు శ్రీఆదివారాహి శక్తి టెంపుల్ ట్రస్ట్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, మహారుద్రస్వామి, కేఎల్ వర్మ కోరారు. గురువారం నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో వారు మీడియాతో మాట్లాడారు. 22న శ్రీజీవలింగేశ్వరస్వామి ఆలయం వద్ద ఉదయం 8 గంటలకు యాత్ర మొదలై ఇందిరా మైదానానికి చేరుకుంటుందని తెలిపారు. సాయంత్రం వారాహి మహాయాగం అనంతరం రథయాత్ర నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, రాజమండ్రి, కాకినాడ మీదుగా విశాఖపట్నం చేరుకోవడంతో పరిసమాప్తమవుతుందని వివరించారు. ఈ సందర్భంగా యాత్ర పోస్టర్, ఆహ్వాన, కరపత్రాలను ఆవిష్కరించారు.

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య రక్షణ



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(అలిపిరి): దేశంలో కాంగ్రెస్ పార్టీతోనే ప్రజాస్వామ్య రక్షణ సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల గురవం బాబు తెలిపారు. రాహుల్ గాంధీపై ఎన్‌డీఏ నేతల వ్యాఖ్యలను ఖండిస్తూ గురువారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నేతలు గొడపేరు చిట్టిబాబు, దొడ్డారెడ్డి రాంభూపాల్ రెడ్డి, తమటం వెంకట నరసింహులు, సుప్రజ, సింధూజ, మునీనా బేగం, చిత్తూరు శివశంకర్, ప్రేమ్ సాగర్, లోకేష్, నాని, దామోదర్ రెడ్డి, గొడుగు చింత గోపి, మోహన్, రాజు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామీణ క్రీడా పోటీలు



మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జి

పాకాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం గ్రామీణ క్రీడా పోటీలు ఘనంగా నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, ఎంఈఓ బాబ్జీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ఆటలు మరుగున పడుతున్న తరుణంలో ఇలాంటి పోటీలు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. రెండు రోజులపాటు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా, చెస్ తదితర క్రీడలు సాగుతాయని వెల్లడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్‌రఫీ, కో–ఆర్డినేటర్ గణపతి, పీడీలు నాగేంద్ర, నిరంజన్‌కుమార్, నాజునిబేగం, సునీత పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యం



సదస్సుకు హాజరైన అధ్యాపకులు, విద్యార్థినులు

తిరుపతి సిటీ : విద్యార్థినులు వ్యక్తిగత పరిశుభ్రతపై దృష్టి సారిస్తే ఆరోగ్యంగా జీవనం సాగించవచ్చని ప్రిన్సిపల్ నారాయణమ్మ తెలిపారు. గురువారం పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, స్టూడెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో కౌమార దశలో బాలికల పరిశుభ్రత, పునరుత్పత్తి ఆరోగ్యం అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించేందుకు శ్రమించాలన్నారు. ఎస్వీ వైద్యకళాశాల గైనకాలజిస్ట్ డాక్టర్ సునీత మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్‌పై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

ప్రైవేటీకరణ దారుణం



చంద్రబాబు అధికారంలోకి వచ్చినప్పుడే అనుకున్నాం. ఇకపై కార్పొరేట్ పాలన సాగుతుందని. గతంలో ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్ వ్యక్తుల చేతులలో పెట్టింది చంద్రబాబే. ఇప్పుడు పేద విద్యార్థులను డాక్టర్లు కాకుండా అడ్డుకునే కుట్రకు తెరతీశారు. మా అమ్మాయి లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. ఈ ఏడాది నీట్‌లో 535 మార్కులు వచ్చినా సీటు రాలేదు. వచ్చే ఏడాది వస్తుందని భావిస్తున్న తరుణంలో కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయాలనుకోవడం దారుణం.

– కృష్ణమూర్తి, విద్యార్థి తండ్రి, తిరుపతి



ఆశలను నీరుగారుస్తున్నారు



నాకు చిన్నప్పటి నుంచి డాక్టర్ కావాలనే కోరిక. అదే ఆశయంతోనే చదువుతున్నా. ఇంటర్ పూర్తి చేసి కోచింగ్ తీసుకుంటున్నా. ఎలాగైనా వచ్చే ఏడాది నీట్‌లో మంచి మార్కులు తెచ్చుకుని ప్రభుత్వ కళాశాలలో సీటు సాధించాలి. అదే లక్ష్యంతో పగలు, రాత్రి కష్టపడుతున్నా. కానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు మెడికల్ సీట్లలో కోత విధించి మా ఆశలను నీరుగారుస్తున్నారు. దయచేసి ఆ ప్రయత్నాలను విరమించుకోవాలని కోరుతున్నా.

– శ్రీలత, విద్యార్థిని, తిరుపతి

అరుపులు.. కేకలు
అధికారుల పరుగులు



సబ్ రిజిస్ట్రార్లు బయటకు వెళ్లిపోవడంతో ఖాళీగా కుర్చీలు

తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం.. నిత్యం క్రయవిక్రయదారులతో రద్దీగా ఉంటుంది. రూ.కోట్ల విలువైన లావాదేవీలతో కళకళలాడుతూ ఉంటుంది. అయితే గురువారం జరిగిన ఓ ఘటన అధికారులను బెంబేలెత్తించింది. కుర్చీలు వదలిపెట్టి పరుగులు తీసే పరిస్థితి కల్పించింది. ఒకే స్థలం రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఇద్దరి మధ్య తలెత్తిన వివాదం చినికి చినికి గాలివానగా మారింది. వారిలో ఓ వ్యక్తి రెచ్చిపోయి టర్పెంట్ ఆయిల్‌ను చల్లడం అందరినీ ఆందోళనకు గురిచేసింది. భయంతో వణికిపోయే దుస్థితికి దారితీసింది.

- తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గొడవ
- ఒకే స్థలం రిజిస్ట్రేషన్ కోసం ఇద్దరి మధ్య వివాదం
- టర్పెంట్ ఆయిల్ చల్లేసి వీరంగం చేసిన ఓ వ్యక్తి
- ఆందోళనకు గురైన క్రయవిక్రయదారులు



టర్పెంట్ ఆయిల్ చల్లడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆందోళన చెందుతున్న క్రయవిక్రయదారులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : తిరుపతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గురువారం ఓ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పెద్ద గొడవ జరిగింది. ఇంతలో ఓ వ్యక్తి కార్యాలయంలో టర్పెంట్ ఆయిల్ చల్లడంతో ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు తమ కుర్చీలను వదిలిపెట్టి కార్యాలయం నుంచి పరుగులు తీశారు. మరోవైపు ఆస్తుల క్రయవిక్రయాలకు కోసం విచ్చేసిన ప్రజలు భయాందోళనకు గురయ్యారు. అరుపులు, కేకలతో కార్యాలయం మొత్తం గందరగోళంగా మారింది.

దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియకు కొంత సమయం బ్రేక్ పడింది. టర్పెంట్ ఆయిల్ అంటుకుంటే ప్రమాదం జరుగుతుందని గుర్తించిన సిబ్బంది వెంటనే శుభ్రం చేయించారు. మరోవైపు సమాచారం అందుకున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. సీటు వదలి వెళ్లిన సబ్ రిజిస్ట్రార్లు కోమలాదేవి, ఆనందన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు.

పత్రాలను పరిశీలించాలి



వివాదాస్పద స్థలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి పత్రాలను నిశితంగా పరిశీలించాల్సి ఉంది. అందుకు రెండు రోజుల సమయం పడుతుంది. ఇద్దరు వ్యక్తులు ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి వచ్చారు. దాంతోనే సమస్య మొదలైంది. ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధులు ఎవరూ నాకు ఈ రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఫోన్ చేయలేదు. డాక్యుమెంట్స్ పరిశీలించిన తర్వాత కరెక్ట్‌గా ఉంటేనే రిజిస్ట్రేషన్ చేస్తాం. ముందుగా ఎవరూ వారికి చలానా కట్టమని చెప్పలేదు.

– శ్రీరామకుమార్, జిల్లా రిజిస్ట్రార్

వివాదం మొదలైంది ఇలా..

నగరంలోని ఉపాధ్యాయనగర్ ప్రాంతంలో సర్వే నంబర్ 11–2బీ, 2ఏ2లో 100 అంకణాల స్థలం ఉంది. సుమారు రూ.6కోట్లకు పైగానే ధర పలుకుతుంది. అయితే ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయాలని డాక్యుమెంట్స్‌తో ఓ వ్యక్తి రెండు రోజుల క్రితం తిరుపతి సబ్ రిజిస్ట్రార్‌ను కలిశారు. పత్రాలను పరిశీలించిన సబ్‌రిజిస్ట్రార్ అంతా ఓకే అని చెప్పారు. దీంతో ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్‌కు గురువారం బ్యాంకు చలానా కట్టి, రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వచ్చారు. అదే సమయంలో మరో వ్యక్తి ఆ స్థలం తనదని డాక్యుమెంట్స్‌ను చూపించాడు. దీంతో ఇద్దరి డాక్యుమెంట్స్ పరిశీలించాలని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అధికారులు స్పష్టం చేశారు. ఇందుకు కనీసం రెండు రోజుల సమయం పడుతుందని తెలిపారు. దీంతో ముందుగా రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి సిద్ధమైన వ్యక్తి ఆగ్రహావేశం వెలిబుచ్చాడు. అధికారులే కావాలని ఇలా చేస్తున్నారని మండిపడ్డాడు. ఈ మాత్రం దానికి తనతో రూ.లక్షల చలానా ఎందుకు కట్టించారని ప్రశ్నించాడు. అయితే ఓ ఎమ్మెల్యే ఫోన్ చేసి జిల్లా రిజిస్ట్రార్ శ్రీరామకుమార్‌పై ఒత్తిడి తీసుకురావడంతోనే రిజిస్ట్రేషన్‌కు బ్రేక్ వేశారని ఆరోపించాడు. ఆగ్రహం పట్టలేక తన వెంట తెచ్చుకున్న టర్పెంట్ ఆయిల్‌ను కార్యాలయంలో చల్లేశాడు. దీంతో అధికారులు, క్రయవిక్రయదారులు దిగ్భ్రాంతి చెందారు. ఎక్కడ మంటలు అంటుకుంటాయో అని ఆందోళన చెందారు. ఇంతకీ సదరు రూ.కోట్ల విలువైన నెల్లూరు చెందిన ఓ వ్యక్తిదని తెలిసింది. ఇప్పుడు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ఇద్దరూ నకిలీ పత్రాలతో రూ.కోట్ల స్థలం కాజేసేందుకు యత్నించినట్లు సమాచారం. ఇందులో రెండో వ్యక్తికి ఓ ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయని, ఆయన కనుసన్నల్లోనే రిజిస్ట్రేషన్‌కు తాత్కాలికంగా బ్రేక్ పడిందని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగులే గుసగుసలాడుకుంటున్నారు. విషయం సద్దుమణిగిన తర్వాత సుమారు రూ.6 కోట్ల విలువైన భూమిని స్వాహా చేసేస్తారని చెప్పుకుంటున్నారు. ఆ స్థలం అసలు యజమానికి ఈ విషయం తెలిసే లోపు మొత్తం ప్రక్రియను పూర్తి చేసేస్తారని చర్చించుకుంటున్నారు.

చంద్రగిరి డీఎస్పీగా ప్రసాద్



తిరుపతి రూరల్ : చంద్రగిరి డీఎస్పీగా బేతపూడి ప్రసాద్ బాధ్యతలను గురువారం స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకే తొలి ప్రాధాన్యమిస్తామని తెలిపారు. జాతీయ రహదారుల్లో బ్లాక్ స్పాట్‌లను గుర్తించి, ప్రమాదాల నివారణకు చర్యలు చేపడతామన్నారు. రౌడీ షీటర్ల నియంత్రణకు పెకఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డీఎస్పీకి తిరుపతి రూరల్ సీఐ చిన్నగోవిందు ఇతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం ఆయన ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీలను మర్యాదపూర్వకంగా కలిశారు.

మొక్కతోనే మానవ మనుగడ



మొక్క నాటుతున్న తహసీల్దార్

భాకరాపేట : మొక్కతోనే మానవ మనుగడ ముడిపడి ఉందని తహసీల్దార్ జనార్దన్‌రాజు తెలిపారు. గురువారం చిన్నగొట్టిగల్లులో మెగా కంపెనీ వారు చేపట్టిన వన మహోత్సవంలో ఆయన పాల్గొన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాల్యా ఇన్‌ఫ్రా ప్రాజెక్టు టీమ్ లీడర్ ఏవీ నాగేంద్రబాబు, ఎన్‌హెచ్ఏఐ వెంకటేశ్వర్లు, డీటీ అన్వర్‌బాషా, విజయ్ కుమార్‌రెడ్డి, రెడ్డెప్ప, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సీసీ కెమెరాలు

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లో గురువారం 29 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఇటీవల బస్టాండ్‌లో చోరీలు పెరగడంతో ప్రయాణికుల భద్రత కోసం నిఘా కట్టుదిట్టం చేశారు. 17 ఫేస్ రికగ్నైజ్ కెమెరాలను పోలీస్ కమాండ్ కంట్రోల్‌కు, 12 కెమెరాలను ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ కార్యాలయానికి అనుసంధానం చేశారు. పోలీసులు సైతం రెండు రోజుల్లో మరో 10 కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు.

ఎస్వీయూలో పోషకాహార మాసోత్సవాలు



పోస్టర్ ప్రదర్శనను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు

తిరుపతి సిటీ : ఎస్వీయూ హోమ్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. వీసీ సీహెచ్ అప్పారావు మాట్లాడుతూ పోషకార ప్రాముఖ్యత తెలిసేలా ఫుడ్ న్యూట్రీషన్, ఫుడ్ టెక్నాలజీ విద్యార్థులు ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆహారపు అలవాట్ల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలు అవగతమయ్యేలా తయారు చేసిన పోస్టర్లు ఆలోచింపజేస్తున్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో హోమ్ సైన్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ మంజుల, రిజిస్ట్రార్ భూపతినాయుడు, ప్రిన్సిపల్ కేటీ రామకృష్ణారెడ్డి, ప్రొఫెసర్ వి.పద్మావతి, ఆర్‌కే అనురాధ, స్వరూపారాణి పాల్గొన్నారు.

ఓజోన్ ఆవశ్యకతపై పోటీలు



విద్యార్థులతో ఉపాధ్యాయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు

పాకాల : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర ఆవశ్యకతపై గురువారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్ మాట్లాడుతూ ఓజోన్ పొర వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం పోటీల్లో విజేతలకు లయన్ కుప్పుస్వామినాయుడు సహకారంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహమ్మద్‌రఫీ, లయన్ గొడుగుచింత రామయ్య పాల్గొన్నారు.

ఇసుక పోస్టర్ విడుదల



ఇసుక పాలసీకి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే నాని

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో గురువారం ఉచిత ఇసుక విధానానికి సంబంధించిన ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. ఇసుక అందుబాటులో ఉండే సమయాన్ని తెలియజేస్తూ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, మైనింగ్ అధికారి ప్రకాష్ కుమార్ పాల్గొన్నారు.

అన్నార్తుల కోసమే అన్న క్యాంటిన్



అన్న క్యాంటిన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆరణి, కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : పేదల ఆకలి తీర్చేందుకే ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు ప్రారంభించినట్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. గురువారం నగరంలోని స్విమ్స్ కూడలి, ఎమ్మార్‌పల్లె, ఈఎస్ఐ హాస్పిటల్ సమీపంలో ఏర్పాటు చేసిన నాలుగు అన్న క్యాంటిన్లను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఐదు రూపాయలకే పేదలకు అన్నం పెట్టడం ఆనందంగా ఉందన్నారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన భోజనాన్ని ఐదు రూపాయలకే అందిస్తున్నామని, ఉదయం 250 మందికి టిఫిన్, మధ్యాహ్నం 350 మందికి భోజనం, రాత్రి 200 మందికి భోజనం అందించనున్నట్లు వివరించారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ఆహార పదార్థాలు సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నరసింహాచారి, బస్వా గీత, రేవతి, నారాయణ, ఎస్ఈ మోహన్, ఎంఈ వెంకటరామిరెడ్డి, డీఈలు సంజయ్ కుమార్ మహేష్, శ్రావణి, రాజు, రెవిన్యూ ఆఫీసర్లు సేతుమాధవ, కేఎల్ వర్మ పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన



సీమంతం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ సభ్యులు పద్మజారెడ్డి

పాకాల : మండలంలోని మద్దినాయనపల్లె పంచాయతీ కొత్త వడ్డిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ కృష్ణవేణి మాట్లాడుతూ పోషకవిలువలతో కూడిన ఆహారం తీసుకుంటే ఆరోగ్యం ఉండవచ్చన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, కార్యదర్శి పవిత్ర పాల్గొన్నారు.

ఘనంగా బజాజ్ ఆటో షోరూమ్ వార్షికోత్సవం



లక్కీడిప్ తీస్తున్న షోరూమ్ నిర్వాహకులు

తిరుపతి కల్చరల్ : రేణిగుంట రోడ్డులోని తిరుమల ఆటోమోటివ్స్ వారి బజాజ్ ఆటో షోరూమ్ 18వ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కస్టమర్లను లక్కీడిప్ ద్వారా ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. ప్రథమ బహుమతిగా బజాజ్ ప్లాటినా 110 సీ బైక్‌ను మణికంఠరెడ్డి, ద్వితీయ బహుమతిగా సి.మునిప్రసాద్(శ్రీకాళహస్తి)కి రిఫ్రిజిరేటర్, తృతీయ బహుమతి వీఓ మొబైల్ ఫోన్‌ను పి.సురేష్(తిరుపతి) అందుకున్నారు. లక్కీడ్రాలో పాల్గొన్న వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. దేవీ నవరాత్రులకు కొత్త బహుమతులు అందించనున్నట్లు షోరూం ప్రతినిధులు తెలియజేశారు. రూ.29,999 డౌన్ పేమెంట్‌కు వాహనం డెలివరీ చేస్తామని వెల్లడించారు.

క్రీడలతోనే మానసిక ఆరోగ్యం

రామచంద్రాపురం: క్రీడలతో మానసిక ఆరోగ్యం పెంపొందించుకోవచ్చని ఎంఈఓలు మార్కొండయ్య నాయుడు, జయవేలు తెలిపారు. గురువారం నెత్తకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్ అండర్–17 బాలుర విభాగంలో కేకేవీపురం ఉన్నత పాఠశాలకు చెందిన భానుప్రకాష్, హేమచంద్ర, కుప్పంబాదూరుకు చెందిన యశ్వంత్ కుమార్, మహేష్, కమ్మకండ్రిగకు చెందిన సల్మాన్, నెత్తకుప్పానికి చెందిన గౌతమ్ సత్తా చాటారు. అండర్–14 బాలుర విభాగంలో కుప్పంబాదూరు హైస్కూల్‌కు చెందిన ఢిల్లీ, బద్రీవిశాల్, దొరకృష్ణ, నెత్తకుప్పానికి చెందిన బాలాజీ, ఢిల్లీశంకర్, కమ్మకండ్రిగకు చెందిన జితేంద్ర ప్రతిభ కనబరిచారు.

తిరుచ్చిపై 'సుందరరాజ'సం



ఊరేగుతున్న దేవదేవేరులు

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయానికి అనుబంధంగా వెలసిన శ్రీసుందరరాజ స్వామివారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఉత్తరాభాద్ర సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్లకు శ్రీకృష్ణముఖ మండపంలో కల్యాణోత్సవం జరిపించారు. అనంతరం సర్వాంగ సుందరంగా అలంకారభూషితులైన దేవదేవేరులు తిరుచ్చిపై ఆసీనులై మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

తాగునీటి కష్టాలు తీర్చాలని వినతి



వినతి పత్రం అందిస్తున్న ఎంపీటీసీ సభ్యుడు చంద్రమౌళిరెడ్డి

చంద్రగిరి : స్థానిక అక్కగార్ల కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు తీర్చాలని ఎంపీటీసీ సభ్యుడు బుల్లెట్ చంద్రమౌళిరెడ్డి కోరారు. గురువారం ఈ మేరకు ఎంపీడీఓ బాలాజీనాయక్‌కు వినతిపత్రం అందించారు. చంద్రమౌళిరెడ్డి మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ ద్వారా కాలనీలో 1.5లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకు, 60 వేల లీటర్ల సంపు నిర్మాణాలను పూర్తి చేశామన్నారు. నీటి సరఫరాకు చంద్రగిరి పాతపేట లైబ్రరీ నుంచి సుమారు 300 మీటర్ల పైపులైను వేయాల్సి ఉందని, . ఇందుకు అవసరమైన నిధులు సైతం జల్ జీవన్ మిషన్ గ్రాంటులో ఉన్నట్లు వెల్లడించారు. స్పందించిన ఎంపీడీఓ వెంటనే సంబంధిత ఏఈకు ఫోన్ చేసి పైపులైను నిర్మాణానికి కావాల్సిన నిధులపై ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.

గణపతి కలశాల పంపిణీ



కలశాల కోసం భక్తుల రద్దీ

తిరుపతి కల్చరల్ : వినాయక చవితి వేడుకల్లో భాగంగా యాదవ వీధిలో ప్రత్యేకంగా 1,800 అష్టలక్ష్మి కలశాలతో రూపొందించిన గణపతి ప్రతిమను గురువారం నిమజ్జనం చేశారు. నిమజ్జనోత్సవాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. కలశాల కోసం ఇప్పటికే రూ.516 చెల్లించి రశీదులు పొందిన భక్తులు యాదవవీధి నుంచి నాలుగుకాళ్ల మండపం వదరకు క్యూకట్టారు. కలశాల పంపిణీ సమయంలో తొక్కిసలాట జరగడంతో ముగ్గురు మహిళలు స్పృహ తప్పి పడిపోయారు. ఈ క్రమంలోనే వినాయక లడ్డూను వేలం పాటలో యాదవ వీధికి చెందిన నిరంజన్ రూ.1.59లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమలో నిర్వాహకులు లోకేష్, దయ, రాజేష్, లోకేష్, గంగాధర్, బాలాజీ,శివ పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందిస్తున్న ఆశావర్కర్లు

తిరుపతి తుడా: జిల్లాలోని ఆశా వర్కర్ల చేత వెట్టి చాకిరి చేయించడం, ఇబ్బందులకు గురిచేయడం చేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరి హెచ్చరించారు. తిరుపతి డీఎంహెచ్ఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో గురువారం జరిగిన ఆశా యూనియన్ జాయింట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని, ప్రసంగించారు. ఆశాలకు సంబంధించిన విధులు మాత్రమే సిబ్బంది కేటాయించాలని, ఏఎస్‌ఎంలకు సంబంధించిన విధులు, ఎమ్‌ఎల్‌హెచ్‌పీ విధులు, పీహెచ్‌సీలో సంబంధం లేని విధులు కేటాయించకూడదన్నారు. అలాగే ఆశాలను కించపరచడం చేయకూడదని, సమావేశాల రోజుల్లో ఆశాలకు స్నాక్స్ అందించాలని ఆదేశించారు. ఆశలను కింద కూర్చోబెట్టకూడదని తగిన గౌరవం ఇవ్వాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆశాల సమస్యలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతకుమారి, డీసీఎం అరుణ, జిల్లాలోని యూనియన్ నాయకులు పాల్గొన్నారు.